క్లుప్తంగా

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన 3 లక్షల రూపాయల చెక్కును వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి శుక్రవారం మార్కాపురంలోని తన నివాసంలో అందించారు. పొదిలి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన కంచర్ల శ్రీను కుటుంబానికి ఈ చెక్కును అందజేశారు. సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దొనకొండలో ఎక్స్‌ప్రెస్‌లు నిలపాలి



ఎంపీ మాగుంట, రాఘవరెడ్డిని సన్మానిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

దొనకొండ: కోవిడ్ సమయంలో రాత్రి వేళల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను అధికారులు నిలిపి వేశారని, నేటికి పునరుద్ధరించ లేదని ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్ రెడ్డి ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డికి శుక్రవారం తెలిపారు. కొనకనమిట్ల, దర్శి, పొదిలి, దొనకొండ ప్రాంతం వారు చాలా మంది ప్రయాణికులు గుంటూరు, విజయవాడకు వెళ్ళి రాత్రివేళల్లో రావడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. కొచ్చెర్లకోటలో మినీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. శ్రీకాంత్‌రెడ్డి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డిని శుక్రవారం ఆయన నివాసంలో కలిసి సమస్యలు వివరించారు. ముందుగా ఎంపీని, ఆయన కుమారుడు రాఘవరెడ్డిని శాలువలు, బొకేలతో సన్మానించారు.

157 మందికి పింఛన్ల మంజూరు

పుల్లలచెరువు: ప్రభుత్వం మండలానికి నూతనంగా 157 పింఛన్లు మంజూరు చేసింది. అందులో భాగంగా శుక్రవారం ఎంపీడీవో మరియదాసు పుల్లలచెరువు సచివాలయం-1,2 వెరిఫికేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త పింఛన్లను విచారణ చేసి అర్హులకు రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో మరియదాసు తెలిపారు. ఇంకా అర్హులు వారుంటే గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అధిక ధరలు తగ్గించాలి

దర్శి: కేంద్ర ప్రభుత్వం గ్యాస్‌సిలిండర్‌కు 2014 నుంచి ఇప్పటి వరకు రూ. 750 లు పెంచి ఇప్పుడు రూ. 200 తగ్గించటం తాటికాయలాక్కొని ఈతకాయ చేతిలోపెట్టినట్లు ఉందని సీపీఐ (యం) దర్శి మండల కమిటీ సభ్యులు సందు వెంకటేశ్వరరావు ఎద్దేవా చేశారు. పెంచిన ధరలపై శుక్రవారం దర్శిలో ప్రచారం నిర్వహించారు. గ్యాస్ సబ్సిడీ నేరుగా వినియోగదారుల ఖాతాల్లో వేస్తానని చెప్పిన నరేంద్రమోదీ 8 ఏళ్లుగా సబ్సిడీ వేయకపోగా 2014 లో రూ. 450 ఉన్న సిలిండర్ రూ. 1200 పెంచి జనం నడ్డి విరిచారని విమర్శించారు. కందిపప్పు కిలో రూ. 80 నుంచి రూ. 120 కి పెంచారన్నారు. కేవీ పిచ్చయ్య, ఉప్పు నారాయణ పాల్గొన్నారు.

సుధారాణి సేవలు అభినందనీయం

కొనకనమిట్ల: గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తూ అందరి మన్ననలు పొంది బదిలీపై వెళుతున్న హెచ్ఎం ఎస్వీ సుధారాణి సేవలు అభినందనీయమని కేజీబీవీ ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, పాఠశాల పూర్వ విద్యార్థి ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఇన్‌చార్జి హెచ్ఎం విజయలక్ష్మి అధ్యక్షతన బదిలీపై వెళుతున్న సుధారాణిని ఘనంగా సన్మానించారు.

నిరుద్యోగ యువతకు అండగా ప్రభుత్వం

- స్కిల్ హబ్‌తో యువతకు ఉద్యోగావకాశాలు
- గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు



స్కిల్ హబ్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కంభం: నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా ఉపాధి కల్పన సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గతంలో శిక్షణ పొందిన యువకులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో స్కిల్ హబ్ కేంద్రాలను ఏర్పాటు చేసి వివిధ రంగాల్లో యువకులు, విద్యార్థులకు మూడు నెలలు శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికెట్లు ఇవ్వడంతో పాటు పలు కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. స్కిల్ హబ్‌లో శిక్షణ పొందిన ఉద్యోగాల్లో చేరకున్నా వివిధ రంగాల్లో రాణించే అవకాశం ఉందన్నారు. జాబ్ మేళాలో 12 రకాల కంపెనీల ప్రతినిధులు పాల్గొని 212 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించగా వారిలో 61 మంది సెలక్ట్ కాగా వారికి ముఖ్య అతిథుల చేతులమీదుగా ఆఫర్ లెటర్స్ అందించారు. ఆర్ఐఓ, కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సైమన్ విక్టర్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు భరద్వాజ్, లోకనాథం, ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ, సర్పంచ్ బత్తుల తిరుపాలమ్మ(రజని), పీడీ మురళి, అధ్యాపకులు, జేసీఎస్ కన్వీనర్ డిష్ మున్నా, గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సూరిబాబు, ఎంపీటీసీ రఫీ, కటికల భాస్కర్ పాల్గొన్నారు.

పిచ్చిరెడ్డి సేవలు మరువలేనివి



కాపా పిచ్చిరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

ముండ్లమూరు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, బొప్పూడివారిపాలెం సొసైటీ మాజీ అధ్యక్షుడు కాపా పిచ్చిరెడ్డి పార్టీ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి కొనియాడారు. జమ్మలమడకలో శుక్రవారం కాపా పిచ్చిరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ అభివృద్ధిలో పిచ్చిరెడ్డిది కీలకపాత్ర అన్నారు. పార్టీ ప్రారంభం నుంచి శక్తివంచన లేకుండా కృషిచేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. సుదీర్ఘ కాలం సొసైటీ చైర్మన్‌గా పని చేసిన కాపా పిచ్చిరెడ్డి రైతుల సంక్షేమం కోసం పాటు పడ్డారన్నారు. ముందుగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో గల వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బూచేపల్లి నందిని, కాపా రమణారెడ్డి, సుగుణ, కాపా నరసింహారెడ్డి, కాపా రాజశేఖరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సూదిదేవర అంజయ్య, రెడ్డిసంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మేకల వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, వైస్ ఎంపీపీ బంకా రమణమ్మనాగిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షులు చింతా శ్రీనివాసరెడ్డి, పసుపుగల్లు ఉపసర్పంచ్ బిజ్జం జ్యోతికృష్ణారెడ్డి, నాయకులు మేదరమెట్ల కోదండరామయ్య, అబ్బుని అంజిరెడ్డి, గాదె నాసరరెడ్డి, సోమేపల్లి సుబ్బయ్య, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

15 రోజుల్లో వైఎస్సార్ బీమా

కురిచేడు: మండలంలోని పడమర వీరాయపాలెం గ్రామానికి చెందిన ఏనుగంటి సురేష్‌బాబు భార్య ఆదినారాయణమ్మకు శుక్రవారం అందజేసినట్లు పంచాయతీ కార్యదర్శి కె. జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. ఆగస్టు 15వ తేదీ ఏనుగంటి సురేష్‌బాబు విద్యుత్ షాక్‌తో మృతి చెందటంతో దానికి సంబంధించిన సర్టిఫికెట్లు పంపి వెంటనేబీమా వచ్చేలా చేసినట్లు తెలిపారు. చెక్కును సర్పంచ్ బొరిగొర్ల శిలక్ష్మి చేతులమీదుగా నారాయణమ్మకు అందజేసినట్లు ఆయన తెలిపారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు ఊట్ల వెంకటేశ్వర్లు, పోకూరి సుబ్బారావు, ఊట్ల పోలయ్య, బొరిగొర్ల గోవిందు, మహిళా సంరక్షకురాలు ఉప్పలూరి శివాని తదితరులున్నారు.

ఎల్ఐసీ పాలసీదారులకు మెరుగైన సేవలు

పొదిలి: భారతీయ జీవిత భీమా సంస్థ ద్వారా పాలసీదారులకు మెరుగైన సేవలు అందుతున్నాయని స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ ఎస్ఎస్.సాహు అన్నారు. శుక్రవారం స్థానిక శాటిలైట్ బ్రాంచ్ కార్యాలయంలో ఎల్ఐసీ 67వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాహు మాట్లాడుతూ.. ఏజెంట్లు సంస్థకు మూల స్తంభాలుగా ఉన్నారన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్ఐసీ ముందుంటోందన్నారు. బ్రాంచ్ మేనేజర్ వెంకటస్వామి మాట్లాడుతూ.. వారం రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. పాలసీదారులకు బహుమతులు అందించారు.

గ్రామాల అభివృద్ధే వైఎస్సార్ సీపీ ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

రాచర్ల: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని చినగానిపల్లెలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన శుక్రవారం పర్యాటించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించి 150 రోజులు పూర్తి కావడంతో ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబుకు జెడ్పీటీసీ పగడాల దేవి, పగడాల శ్రీరంగం అధ్వర్యంలో యాపిల్ పండ్లతో కూడిన భారీ గజమాలను క్రేన్ సాయంతో ఘన స్వాగతం పలికారు. అంతేగాక 150 కేజీల కేక్‌ను కట్ చేశారు. ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేతల ప్రభుత్వమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల హామీలో ఇచ్చిన నవరత్నాల వాగ్దానాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రతి నిరుపేద కుటుంబానికి నవరత్నాలతో ఆర్థిక చేయూత ఇస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం చేసే అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్షాల అసత్య ప్రచారాలు చేస్తున్నాయని దుయ్యాబట్టారు. గ్రామంలోని 262 ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన 320 బుక్‌లెట్లు అందజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న ప్రభుత్వ పథకాల లబ్ధిపై ఆరా తీశారు. ఎంపీపీ షేక్ ఖాశింబీ, చినగానిపల్లె, రాచర్ల, అనుములపల్లె, ఆకవీడు సర్పంచ్‌లు పగడాల రమేష్, సగినాల రాయలమ్మ, రమేష్, తలపాటి దేవదానం, ఎంపీటీసీలు సుబ్బారాయుడు, అర్ధవీడు ఎంపీపీ వెంకట్రావు, మాజీ ఎంపీపీ రవికుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మరళీకృష్ణ, నెమలిగుండ్ల రంగ నాయకస్వామి ఆలయ చైర్మన్ కన్నసాని చిన్న ఓబులేసు, రామాపురం సొసైటీ అధ్యక్షుడు మదిరె శ్రీరంగరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చిట్టెం మార్క్, సూర పాండురంగారెడ్డి, ముత్యాల మధు, డాక్టర్ పుల్లారెడ్డి, ఎంపీడీవో కె.కవితా చౌదరి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్



నూతన పింఛన్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

రాచర్ల: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్‌లు మంజూరు చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండలంలోని చినగానిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నూతనంగా మంజూరైన 123 పింఛన్‌లు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. జెడ్పీటీసీ పగడాల దేవి, ఎంపీపీ ఖాశింబీ, చినగానిపల్లె సర్పంచ్ పగడాల శ్రీరంగం, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ పాల్గొన్నారు.

మురుగు పారేలా చర్యలు తీసుకోవాలి

కంభం: కందులాపురం-3 సచివాలయం పరిధిలోని కల్కిభగవాన్ సమీపంలో కాలువలో నీరు వెళ్లకుండా మట్టి వేయడంతో మురుగు వెళ్లే మార్గం మూసుకుపోయిందని, అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం స్థానికంగా నివాసం ఉంటున్న రమణారెడ్డి, దండుగ రంగారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. డ్రైనేజీ కాలువల్లో నీరు వెళ్లకుంటే ఇళ్ల ముందు నిలిచి దుర్వాసన వస్తోందని, వెంటనే నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నవరత్నాలతో సంక్షేమ వెలుగులు



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం రూరల్: మీకు సేవ చేసేందుకే మీ ముందుకు వస్తున్నా అని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని బొడిచర్ల సచివాలయ పరిధిలోని బొందలపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ.. నవరత్నాల ద్వారా అందరికీ సంక్షేమ కార్యక్రమాలు సీఎం జగనన్న అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాల అమలు వల్ల ప్రజల కష్టాలు తీరుతున్నాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో ఆర్థిక భారం తొలగించారన్నారు. రైతు భరోసా, అమ్మ ఒడి, ఆసరా, వైఎస్సార్ పింఛన్, జగనన్న విద్యాదీవెన పథకాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. ముందుగా స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పూలు చల్లుతూ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లాపురం లక్ష్మీదేవి, సచివాలయ కన్వీనర్లు భవనం వెంకటరామిరెడ్డి, మారంరెడ్డి నాగిరెడ్డి, నాయకులు మారంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ నర్సింహులు, ఏపీఓ రమేష్, ఏపీఎం జీవరత్నం, సోషల్ మీడియా ప్రతినిధులు శివారెడ్డి, ఎల్.శేఖర్, ఇంద్రసేనారెడ్డి, తిప్పాయిపాలెం పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఆర్‌ఏవీ నారాయణ, ఎస్సై వెంకటేశ్వరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏ-1 గ్లోబల్‌లో సెమినార్

మార్కాపురం: పట్టణంలోని ఏ-1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ సీఎస్ఇ బ్రాంచ్‌కు చెందిన విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషీన్ లెర్నింగ్‌పై సెమినార్ నిర్వహించారు. ట్రైనర్ డాక్టర్ వరప్రసాదరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. నేటి ఆధునిక యుగంలో స్వయంశక్తితో నడిచే కార్లు, హెల్త్‌కేర్, విద్యారంగం, రొబోటిక్, ఎంటర్‌టైన్‌మెంట్, సోషల్ మీడియా విస్తృతంగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఏ1 కళాశాల చైర్మన్ మీర్జా షంషేర్ ఆలీబేగ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, హెచ్ఓడీ రఫీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి మౌలిక సదుపాయాలు

కొనకనమిట్ల: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నాడు-నేడు ద్వారా ప్రభుత్వం మౌలిక సదుపాయలు కల్పిస్తోందని ఎంఈఓ బి.నరసింహారావు పేర్కొన్నారు. మర్రిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలించారు. హెచ్ఎం ఎస్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

యర్రగొండపాలెం: వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా శనివారం పట్టణంలో పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించే కార్యక్రమం, రాజీవ్ అతిథి గృహం ఆవరణలో సభ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఘనంగా అంతర్జాతీయ డ్రైవర్ల దినోత్సవం

పెద్దదోర్నాల: అంతర్జాతీయ డ్రైవర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలో డ్రైవర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంటా వెంకట రమణారెడ్డి, ఉప సర్పంచ్ దూదేకుల రసూల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అసోసియేషన్ సభ్యులకు దూదేకుల రసూల్ వ్యక్తిగతంగా రూ.50 వేల నగదు అందజేశారు. నగదును డ్రైవర్ల సంక్షేమానికి వినియోగించుకోవాలని సూచించారు. డ్రైవర్లకు వ్యక్తిగత ఇన్సూరెన్సు చేయించనున్నట్లు ఆయనే తెలిపారు. డ్రైవర్సు యూనియన్ అధ్యక్షుడు షేక్షావలి, మండలానికి చెందిన డ్రైవర్లు పాల్గొన్నారు.

మార్కాపురంలో కూడా..

మార్కాపురం: స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం డ్రైవర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కృష్ణ చైతన్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాలలో పనిచేసే ప్రతి డ్రైవరును సన్మానించారు. డ్రైవింగ్‌లో తీసుకోవాల్సిన మెళకువలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎ.రంగనాయకులు, ఏఓ బి.ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అనీల్ కుమార్, వివిధ విభాగపు అధిపతులు పి.రామ్మోహన్, డాక్టర్ జేవీ అనీల్ కుమార్, కె.రాముడు, కె.కిశోర్‌బాబు, బి.రాజు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగు చేసిన పంటలను నమోదు చేయాలి

బేస్తవారిపేట: రైతులు సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ బుకింగ్ చేయాలని తహసీల్దార్ డీవీబీ వరకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ-క్రాప్ బుకింగ్ సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. పొలాలను సందర్శించి ఆ సర్వే నంబర్లలో ఏ పంటలు వేశారో వాటినే సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు. వీఆర్వోలు సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లకు పూర్తిగా సహకరించాలన్నారు. ఏఓ జక్కం మెర్సీ, వీఆర్వోలు పాల్గొన్నారు.

అందరూ చదువుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

పుల్లలచెరువు: గ్రామాల్లో అందరూ చదువుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎంఈవోలు శామ్యూల్ జాన్, ఇందిరాప్రసాద్ అన్నారు. శుక్రవారం మర్రివేముల సచివాలయం పరిధి జీఈఆర్ సర్వేను వారు పరిశీలించారు. అనంతరం ఎంఈవోలు మాట్లాడుతూ గ్రామాల్లో బడి మానేసిన విద్యార్థులు ఉండకూడదన్న ఉద్దేశంతోనే గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నామని, ఈ సర్వేను త్వరగా పూర్తి చేయాలని వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, వలంటీర్లకు సూచించారు. అనంతరం ఆదే గ్రామంలో పాఠశాలను తనిఖీ చేసి రికార్డులు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

రేపు అవగాహన సదస్సు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని విశ్వబ్రాహ్మణుల సంఘం ఆవరణలో ఈ నెల 3వ తేదీన వృత్తి శిక్షణపై జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లె శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు విశ్వబ్రాహ్మణ సేవ అధ్యక్షుడు దత్తాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి విశ్వకర్మ కౌసల్ యోజన ద్వారా కులవృత్తులు నిర్వహించుకునే వారికి తక్కువ వడ్డీతో బ్యాంకు రుణాలు అందించే అవకాశాలున్నాయి. వాటిపై పూర్తి అవగాహన కల్పించనున్నారు. ప్రతి విశ్వబ్రాహ్మణుడు సమావేశానికి హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాల కోసం 82971 92808 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

295 మందికి వైద్య పరీక్షలు

గిద్దలూరు రూరల్: మండలంలోని అంబవరంలో డాక్టర్ బ్రహ్మానందరెడ్డి వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 295 మందికి వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ వైద్య పరీక్షల్లో కంటి సమస్య పరిష్కారం కోసం 52 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వివిధ రకాల వ్యాధులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్ వర్ధంతిని జయప్రదం చేయండి

కురిచేడు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 14 వ వర్ధంతి శనివారం స్థానిక బస్టాండు సెంటర్లో నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, అభిమానులు జయప్రదం చేయాలని కోరారు.

బైజూస్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

యర్రగొండపాలెం: ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులు బైజూస్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యాప్‌పై 9వ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఇప్పటి వరకు జరిగిన పాఠాల వీడియోలు చూడటం, ఎప్పటికప్పుడు టెస్ట్ రాయాలని, ఇవి ట్యాబ్స్‌లోని ఆన్‌లైన్‌లో కనిపిస్తుంటాయన్నారు. విద్యార్థులు ఇప్పటి వరకు 3 వేల నిమిషాలు సద్వినియోగం చేసుకోవాలని, ఆ విధంగా ఉపయోగించని విద్యార్థులతో వారంలోపు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

పాఠశాలల తనిఖీ

కురిచేడు: మండలంలోని పలు పాఠశాలలను మార్కాపురం డిప్యూటీ ఈఓ ఏ. చంద్రమౌళేశ్వర్ శుక్రవారం పరిశీలించారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శనివారం మండలంలోని పలు విద్యాలయాలు, సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేస్తారనే సమాచారంతో అప్రమత్తమయ్యారు. దర్శి లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, బోధనంపాడు లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, నాడు -నేడు ప్రోగ్రెస్ పరిశిలించారు. స్థానిక జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల, పొట్లపాడు, దేకనకొండలోని జిల్లాపరిషత్ పాఠశాలలను పరిశీలించారు. ఎంఈఓ ఆర్ వస్త్రాంనాయక్, ఎన్వీ నాగిరెడ్డి ఉన్నారు.

వైఎస్సార్ సీపీ కేడర్‌కు బీమా సౌకర్యం

మార్కాపురం టౌన్: వైఎస్సార్ సీపీ కేడర్‌కు బీమా సౌకర్యం కల్పిస్తున్నామని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శి, టౌన్ జేసీఎస్ కన్వీనర్ పత్తి రవిచంద్ర పేర్కొన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు వైఎస్సార్ సీపీ తరఫున రూ.10 లక్షల బీమా సౌకర్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని, పార్టీ కార్యకర్తల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 2, 9వ సచివాలయ కన్వీనర్లు వెంకటేశ్వర నాయుడు, నాగూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల క్షేమానికి ప్రాధాన్యం

మార్కాపురం: తల్లీబిడ్డల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వైఎస్సార్ సీపీ 16వ బ్లాక్ కౌన్సిలర్ దారివేముల హర్షిత పేర్కొన్నారు. ఈ నెల 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న పోషణ మహోత్సవాల్లో భాగంగా భగత్‌సింగ్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ ఉత్సవాన్ని ప్రారంభించారు.